www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 6 సెప్టెంబర్ 2024

వరద బాధితులకు సాయం

విజయవాడలో ఎమ్మెల్యే గురజాల సేవలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు విజయవాడలోని 16వ వార్డు కృష్ణలంక, పరిసర వరద ప్రభావిత ప్రాంతాల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గురువారం ఉదయం నుంచి పర్యటిస్తున్నారు. బాధితుల సమస్యలు తెలుసుకుంటూ వారికి అవసరమైన నిత్యావసరాలను అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల వద్దకు వెళ్లి వరద బాధిత ప్రజలకు అందుతున్న వైద్యసేవల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్నారు

లక్ష ఆర్థిక సాయం అందించిన పార్థసారధి నాయుడు

విజయవాడ వరద బాధితులకు మాజీ కౌన్సిలర్ పార్థసారధి నాయుడు లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ విద్యాధరణి కలిసి లక్ష రూపాయలను చెక్కు రూపంలో అందజేశారు. వరద బాధితుల కోసం తన వంతు చిరుసాయంగా అందిస్తున్న నగదును ప్రభుత్వానికి పంపించాలని ఆయన జెసిని కోరారు.

రూ.25వేలు ఆర్థిక సాయం చేసిన సోక్రటీస్ హై స్కూల్ కరస్పాండెంట్

ఎస్ఆర్ పురం : విజయవాడ వరద బాధితులకు మానవతా దృక్పథంతో వెదురుకుప్పం మండలం సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ దేవళం పేట కరస్పాండెంట్ ఎస్.గుణశేఖర్ సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.25 వేలు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఎవరైనా విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద విరాళం అందించాలన్నారు. సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ దేవళంపేట కరస్పాండెంట్ గుణశేఖర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్

కాణిపాకం వినాయక స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లను ఈనెల 6వ తేదీ సాయంత్రం లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, ఎస్పి మణికంఠ చందోలు, ఆలయ ఈఓ గురు ప్రసాద్‌తో కలసి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కాణిపాకం దేవస్థాన కమిటీ సభ్యులు, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 07న ప్రారంభమై 21 రోజులు నిర్వహించడం జరుగుతుందని, అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ఈ నెల6వ తేదీ సాయంత్రం లోపు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు సదుపాయాలు కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో ప్రతిరోజూ 2 మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని, 108 వాహనాలను 2 అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే రాత్రివేళల్లో అత్యవసర సేవలు అందించడానికి డాక్టర్లు అందుబాటులో ఉంచాలని డిఎంఅండ్ హెచ్ఓను ఆదేశించారు. ఈనెల 14, 21, 25 తేదీలలో ఆలయ పరిసర ప్రాంతాలలో రెండు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేయాలని ఎక్సైజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయానికి వచ్చే మార్గాలకు అవసరమైన మరమ్మతులు పూర్తిచేయాలని ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ వాహనదారుల దగ్గర అధిక రుసుం వసూలు చేయకుండా రవాణాశాఖ అధికారులు నిఘా ఉంచాలన్నారు. అనుకోని అగ్నిప్రమాదాలు తలెత్తినప్పుడు స్పందించి మంటలను అదుపు చేయడంలో అగ్నిమాపక శాఖ ద్వారా ఆలయ సిబ్బందికి తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు అత్యవసర సేవల నిమిత్తం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. పీలేరు, చిత్తూరు నుండి ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు సంబంధించి పోలీస్ సిబ్బంది పకడ్బందీగా బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. విఐపిలు, ఉభయదారులు వారికి కేటాయించిన సమయంలో దర్శనాలకు రావాలని, సామాన్యభక్తులకు దర్శనాలకు సహకరించాలన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు అవసరమైన సమాచారాన్ని అందించే విషయంలో ఓపికతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో ట్రాన్స్కో ఎస్ ఈ సురేంద్ర నాయుడు, ఆర్ అండ్ బి ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి ఆయేషా బేగం, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి, డిపిఓ లక్ష్మి, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, కాణిపాకం ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ్ హరి మాధవరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బోయకొండ బాధితులకు న్యాయం చేయాలి

తహశీల్దార్, ఈవోలకు సిఐటియు వినతి

తహశీల్దార్, ఈవోలకు వినతిపత్రం అందిస్తున్న బాధితులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -పుంగనూరు: గత ప్రభుత్వం బోయకొండ అభివృద్ధి పేరుతో స్థానికులు ఇళ్లను, వ్యాపారస్తుల అంగళ్ళను దౌర్జన్యంతో తొలగించి ఎలాంటి నష్టపరహారం ఇవ్వలేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. స్థానికంగా ఉన్న ఇళ్లను కోల్పోయిన వారికి నష్టపరహారం ఇవ్వాలని గురువారం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈఓ, తహసీల్దార్‌లకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, సిఐటియు మండల అధ్యక్షుడు చంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వం కాలంలో పేదలపై దౌర్జన్యం చేసి ఇండ్లను షాపులను కూల్చివేయడం దుర్మార్గమన్నారు. వారికి నష్టపరహారం కట్టిస్తామని హామీ ఇచ్చి ఐదు సంవత్సరాల అవుతున్నప్పటికీ ఒక రూపాయి కూడా నష్టపరహారం ఇవ్వలేదన్నారు. గతంలో ఉన్న అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించడం వలన నష్టం జరిగిందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన వారికి భూములు ఇవ్వాలని, ఇల్లు ధ్వంసం చేసిన వారికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించాలని, షాపులు కోల్పోయిన వారికి షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. శ్రీబోయకొండ గంగమ్మ దేవస్థానం అభివృద్ధి కోసం పేదలందరూ సహకరిస్తే వీరికి మాత్రం అన్యాయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అందరి మొక్కలు తీర్చే గంగమ్మ కూడా భక్తులకు సేవలు చేస్తున్న వారికి మోసం చేయడం దారుణమన్నారు. ప్రస్తుత ఈవో, మాజీ ఈఓలతో చర్చలు జరిపిన తర్వాత వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఎలాంటి సమాచారం తమకు ఇవ్వలేదని వారు భూములు కోల్పోయిన వివరాలు తమకు ఇస్తే నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి తెలియజేస్తామని దాని ద్వారా డబ్బులు వస్తాయని చెప్పారు. తర్వాత తహశీల్దార్‌ను కలిసి భూముల వివరాలన్నిటిని దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఆర్ఐ, సర్వేయర్, వీఆర్ఓలతో కలిపి కమిటీ ఏర్పాటు చేసి వారంలో సర్వేచేసి రిపోర్టును పై అధికారులకు పంపుతామని తెలిపారు. బోయకొండ బాధితుల సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బోయకొండ బాధితుల కమిటీ ఏర్పాటు

అభివృద్ధి పేరుతో నష్టపోయిన బాధితులందరూ బోయకొండ బాధితులు కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా మనీ, కార్యదర్శిగా గంగాదేవి, కోశాధికారి శబరిష్‌లతోపాటు 22 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

ఉపాధ్యాయులు.. సమాజ నిర్మాతలు

- ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం చిత్తూరులోని జెడ్‌పి సమావేశ మందిరంలో గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పి ఛైర్మన్, జేసి జి.విద్యాధరి, జిడి నెల్లూరు ఎమ్మెల్యే వి.ఎం.థామస్, నగర మేయర్ అముద పాల్గొన్నారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. గురువులు లేని సమాజం అర్థం లేనిది అన్నారు. ఒక వ్యక్తి ఐఎఎస్, ఐపిఎస్, రాజకీయ నాయకులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడ్పడే మహనీయులు ఉపాధ్యాయులు అని అన్నారు. ఉపాధ్యాయులు వారి వృత్తి ద్వారా జ్ఞానాన్ని పంచి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట రమణారెడ్డి, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి, చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయం స్కూల్‌లో..

విజయం స్కూల్‌లో.. స్థానిక విజయం విద్యాసంస్థలలో గురుపూజోత్సవం సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వలన ఉన్నతస్థాయికి ఎదుగుతారని కనుక విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని అన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ రమేష్, వైస్‌ఛైర్మన్ గోవర్ధన్ బాబి, ట్రెజరర్ తేజోమూర్తి, కమిటీ సభ్యులు అరుణ కుమారి, కార్యదర్శి సహదేవ నాయుడుపాల్గొన్నారు.

దేవి పాఠశాలలో.. చిత్తూరు గిరింపేట దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించిచారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గురించి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్ఆర్.ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీ స్కూల్‌లో..

చిత్తూరులో అవార్డులు అందిస్తున్న జెడ్‌పి ఛైర్మన్

గుడిపల్లి: మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సభకు ఆచార్య శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కేవలం అధ్యాపకుడు మాత్రమే కాదని, ఆయన గొప్ప తాత్వికుడని కొనియాడారు. ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా ఉండాలని, సమాజం పట్ల నిబద్ధత ఉన్నప్పుడే మంచి తరాలను నిర్మించగలుగుతారని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య శ్యామల, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుపల్లి ద్రావిడ వర్సిటీలో..

వెదురుకుప్పం: మండలం పాతగుంట జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గురువారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని బృందాన్ని స్కూల్ కమిటీ ఛైర్‌పర్సన్ కుష్బు, సర్పంచ్ జి.భువనేశ్వరి, జనసేన నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్‌ర ఎడ్డి, మాజీ ఎంపిటిసి భాస్కర్‌ర ఎడ్డి, మునిరత్నం శెట్టి సన్మానం చేసి సత్కరించారు.

రామకుప్పం: బాధ్యతాయుత సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని అందుకే ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని ఎంఈఓ నారాయణ అన్నారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈఓ అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు. కుప్పం ఆర్‌డిఓ శ్రీనివాస్‌రాజు మాట్లాడుతూ తన వ్యక్తిగత జీవితంలో విద్యపరంగా ఎదురైనా సమస్యలను అధిగమించడంలో ఉపాధ్యాయులు తనకు ఇచ్చిన ప్రేరణ, సలహాలు, సూచనలు, తను ఈ స్థాయికి ఎదగడానికి కారణమని తెలియజేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారికి ఆర్‌డిఓ దుశ్శాలువా, ప్రశంస పత్రం, మొమెంటోలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఆటల పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి నారాయణ బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు శంకర్, నాగరాజు, పాల్‌దేవ్, నాగేశ్వర్ రావు, నంద కుమార్, విజయ్, సూర్య పాల్గొన్నారు.

విజయపురం: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మండల విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు సమాజానికి వన్నె తెస్తున్నారని, విలువలతో కూడిన విద్యను నేర్పి సమాజానికి ఆదర్శంగా ఉంటున్నారని ఎంఈవో హరిప్రసాద్ శర్మ తెలిపారు. గతంలో పని చేసి పదవీవిరమణ చేసిన ఎంఈవో ఆంజనేయులు, కైలాసం యాదవ్‌ను ఉపాధ్యాయలను పూలమాల దుశ్శాలువాతో సత్కరించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ వంశీకృష్ణను, మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి మెమొంటో అందించారు.

సోమల: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీభారతి విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు ఆధ్వర్యంలో విశ్రాంత అధ్యాపకులను సన్మానించారు. మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరులోని భారతి విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను కరస్పాండెంట్ షేక్ మహమ్మద్ అంజాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమలలో..

గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని కడపగుంట గ్రామంలో సుమారు 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా రెండు తరాలకు విద్యను అందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డికి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఘనంగా గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ బిల్డర్ కందిబిల్ల సుబ్రహ్మణ్యం నాయుడు, ఇంజనీర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, సర్పంచ్ బుజ్జి దామోదర్ రెడ్డిని దుశ్యాలవ పూలమాలతో ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ షణ్ముగం, మాజీ ఎంపిటిసి పుష్పరాజు, ఆర్ముగం పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సామాజ కృషి ఒల్లులు ఉపాధ్యాయులని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురుపూజోత్సవ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం జరిగింది. మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, జిఆర్ కన్స్ట్రక్షన్ అధినేత ఈశ్వర్ నాయుడు మండలంలోని ఉన్నత, ప్రాథమిక ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సీఆర్పీలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో..

పెద్దపంజాణి: సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని నాగిరెడ్డిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబు రడ్డి అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, మాధవన్, గంగాధర్, రాజేష్ బాబు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

కార్వేటినగరం: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని స్థానం అత్యున్నత మైనదని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మిరెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనంజయరెడ్డి, అధ్యాపకులు సీఎన్.లత, డాక్టర్ సుబ్బారావు, హరిబాబు, కార్తిక్, జోగి ప్రసాద్ పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక హిందూ ముస్లిం కళ్యాణ మండపంలో ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

కార్వేటినగరంలో..

ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన విద్యావనరుల కేంద్రమైన ఎస్ఆర్ పురంలో గురుపూజోత్సవంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బసివరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు దివ్య, మంగుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌డబ్ల్యు ఉపాధ్యాయురాలు చంద్రకళ, నెలవాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, పిల్లారి కుప్పం 1 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రామతులసి, దుర్గరాజపురం ప్రాథమిక పాఠశాల హరిబాబును మండల విద్యాధికారులు అరుణాచలంరెడ్డి సబర్మతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, తహశీల్దార్ అమర్నాథ్, ఏవో కృష్ణయ్య, ఎస్సై సుమన్ పాల్గొన్నారు.

జిడినెల్లూరులో..

శాంతిపురం: మండల పరిధిలోని పరిధిలోని శ్రీపరమహంస యోగానంద విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యాలయ ఛైర్మన్ గోపాల్ అగర్వాల్, జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ గొప్పదనాన్ని తెలిపారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జీవిత విశేషాలను గురించి విద్యార్థులకు వివరించారు.

పలమనేరులో..

పలమనేరు: పలమనేరులోని లయన్స్ క్లబ్‌లో మండలం విద్యాశాఖ అధికారులు పి.లీలారాణి, బాల సుందరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలో ఎంపీపీ ఘంటా ఊరు పాఠశాల పనిచేస్తున్న మంజుల, ఎంపీపీ కొలమాసనపల్లె సౌత్ పాఠశాల పనిచేస్తున్న తిలోక్ చంద్ జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వడంతో వారిని ఘనంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

సదుంలో..

ప్రజాశక్తి- సదుం: ఉత్తమ ఉపాధ్యాయులను ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సుభాషిణి, నాగవేణి, సరళా కుమారి, బేబీ రోహిణి, కౌసర్, కృష్ణమూర్తి, సురేంద్రనాథ్ రెడ్డి, నాగరాజ, సుబ్రమణ్యం, జయప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయుడు జె.సుధాకర్ రెడ్డిని సన్మానించారు. ఎంఈవో శ్రీరాములు, ఎంఈవో 2 దామోదర్, ఎంపిడిఓ జి.రాజశేఖర్ బాబు, ఎస్సై షేక్‌షావలి పాల్గొన్నారు.

రామకుప్పం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రామకుప్పం మండలంకు చెందిన భగలనత్తంలోని ఎంపియూపి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కె.జానకి, రామకుప్పం బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్ఎం. ప్రభురామ్‌లను ఎంఈవోలు మహబూబ్ బాషా, నారాయణ ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు శాలువా కప్పి ప్రసంసాపత్రం, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మన్‌దొడ్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటాద్రి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొంది ఇలా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గా అవార్డు కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉందని అంటున్నారు

రామకుప్పంలో..

వెదురుకుప్పంలో..

విజయపురంలో..

శాంతిపురంలో..

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: సకల గణాలకు అధినాయకుడైన వినాయకుడిని చవితి సందర్భంగా పూజిస్తే సకల విఘ్నాలు తొలగుతాయని భక్తులు నమ్మకం. ప్రతి ఏటా వినాయక చవితికి భారీగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు చవితి పందిళ్లలో ఏర్పాటు చేసి పూజించడం ఆనవాయితీగా మారింది. పిఓపి విగ్రహాలను వినియోగిస్తే పర్యావరణానికి తద్వారా మానవాళికి చేటు అని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. మరోవైపు మట్టితో తయారుచేసిన స్వామి విగ్రహాలను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని వేద పండితులు, మట్టివిగ్రహాలతో పర్యావరణ పరిక్షణ ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. హానికర రసాయనాలతో కలిసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు ఏమాత్రం సమ్మతం కాదని చెబుతున్నారు. ఈ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారీకి గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పలుచోట్ల ఇతర రాష్ట్రాల నుంచి కళాకారులు ప్రతి ఏటా ఇక్కడికి చేరుకుని విగ్రహాల రూపొందించి విక్రయిస్తున్నారు.

వినాయక చవితికి నెల రోజులు ముందే విగ్రహాలు ఎంపిక చేసి అడ్వాన్స్ డబ్బు ఇచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీగా వినాయక విగ్రహాలు సిద్ధం చేశారు. చెరువులు, కాలువల్లో దొరికే బంక మట్టితో గణపతి బొమ్మలను తయారుచేసిన ఆ విగ్రహాలను మూడు రోజుల పూజలు తర్వాత సమీపంలోని చెరువుల్లో, కుంటల్లో నీటిలో నిమజ్జనం చేస్తారు. ఈ మట్టి విగ్రహాలను చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేయడం వలన సులభంగా బొమ్మలు నీటిలో కరిగిపోవడంతో పాటు బంకమట్టి వలన నీటికి ఔషధ గుణాలు కలుగుతాయని పర్యావరణ పరిరక్షకులు చెబుతున్నారు. మట్టి విగ్రహాలను పందిళ్ళలో ఏర్పాటు చేసి పూజించాలని కొన్ని ఏళ్లగా స్వచ్ఛంద సంస్థలు చెందిన సభ్యులు భక్తులకు సూచిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వినియోగించడం వలన కలిగి అనర్థాలను వివరించడంలో సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న ప్రజల్లో మార్పు మాత్రం రావడం లేదు. వినాయక చవితి వేడుకలు సందర్భంగా గ్రామాల్లో మట్టి బొమ్మలని పూజించాలని, ప్లాస్టర్ అఫ్ ప్యారీస్‌తో తయారుచేసిన బొమ్మలు వినియోగం నిర్మూలనకు ప్రజల్లో స్వచ్ఛందంగా మార్పు రాకపోతే చెరువుల్లో, కుంటల్లో కాలుష్యం పెరిగిపోయి తద్వారా ఆ నీటితో అనారోగ్యాలకు దారితీస్తుందంటే అతిశయోక్తి కాదు.

మట్టి బొమ్మలే మంచిది..

మట్టితో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నీటిలో నిమర్జనం చేయడం వలన ఆ నీటిని మళ్లీ మనుషులు వాడినప్పుడు చర్మ సంబంధిత వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

అందువల్ల మట్టి వినాయక బొమ్మలను పూజించాలి, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సహకరించాలి.

- డాక్టర్ దుర్గాదేవి, పీహెచ్‌సీ డాక్టర్, గంగాధరనెల్లూరు.

పర్యావరణాన్ని కాపాడాలి

పిఓపి విగ్రహాల కన్నా మట్టి విగ్రహాలు శ్రేష్ఠం. రసాయనాలతో తయారుచేసి విగ్రహాలను చెరువుల్లో పడేయడం వలన ఆ నీటిని పశువులు, మేకలు, గొర్రెలు తాగి వ్యాధుల భారిన పడతాయి. మానవాళికి దీని వలన ప్రమాదం. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. కనుక ఈ సారి ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు వాడటంపైన దృష్టి సారిస్తే మంచిది.

- రాజేంద్ర నాయుడు, ఇన్చార్జి హెడ్ మాస్టర్ జడ్పీ హైస్కూల్, తూగుండ్రం గ్రామం

క్రైం న్యూస్

చోరీ కేసులో నిందితులకు రిమాండ్

సీఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చోరీ కేసులో నిందితులను గురువారం రిమాండ్‌కు పంపినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఓటు వంక గ్రామ సమీపంలో ఎక్స్ప్రెస్ హైవే పనుల్లో గత నెల 31వ తారీఖున మూడు లక్షల విలువ గల గరండాలను అపహరించినట్టు దిలీప్ కన్స్ట్రక్షన్స్ మేనేజర్ ఫిర్యాదు చేశారు దీనిపై దర్యాప్తు చేపట్టగా గురువారం పాలేరు బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బైరెడ్డిపల్లి మండలం చప్పడిపల్లి అగ్రహార గ్రామానికి చెందిన నేతాజీ, చిత్తూర్ రూరల్ చెర్లోపల్లి పోస్ట్ కమ్మపల్లికి చెందిన కుమార్, ప్రకాష్, వేణుగోపాల్ టాటా ఇంటర్ థర్డ్ గూడ్స్ క్యారేజ్ వాహనంలో ఎస్కార్ట్ గా రెండు ద్విచక్ర వాహనాల ద్వారా గరండాలను తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు వారిని అదుపులో తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వీరిపై పలుస్టేషన్లల్లో చోరీ కేసులు నమోదయి ఉన్నాయని దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు సిఐ తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని ఆర్‌బికె సెంటర్‌లో గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ పొలం పిలుస్తోంది వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారంలో రెండు రోజులు మంగళవారం, బుధవారం రెండు గ్రామాల చొప్పున వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల అధికారులు రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు. ఈకార్యక్రమం ఈనెల 10 తేదీ నుంచి ప్రారంభం అవుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి జి.ప్రవీణ్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఐరాల మండలం, బెస్తపల్లి గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో ఆ గ్రామాన్ని సహాయ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పరిశీలించారు. డెంగీ కేసు నమోదు అయిన జ్యోతిర్మయి ఇంటిని సందర్శించడంతోపాటు మెడికల్ క్యాంప్ ఏర్పాటును తనిఖీ చేశారు. గ్రామ సర్పంచ్ మల్లేశ్వరి, స్థానిక నాయకులు కె.రాజేంద్ర ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరికీ సమావేశం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరం కేసుల కొరకు విచారణ నిర్వహించారు. అలాగే ఇంటి లోపల ఇంటి వెలుపల ఉన్న నీటి నిల్వలను పరిశీలించి దోమల లార్వా ఉన్న వాటిని తొలగించారు. గ్రామ పంచాయితీ సెక్రటరీ కె.తులసీరామ్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటిలో కూడా సైఫెనిత్రిన్ మందు స్ప్రే చేయించారు. గ్రామములో ఉపయోగించని బావి పై మూతవేయాలని పంచాయతి వారికి సూచన చేశారు. ఈ కార్యక్రమానికి హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఆశాలు పాల్గొన్నారు.

210 సీసీ రోడ్ల పనులకు రూ.11.90 కోట్లు

పంచాయతీరాజ్ ఆనంద రెడ్డి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: నియోజకవర్గంలో ఎన్ఆర్‌జిఎస్ పథకం ద్వారా 210 సీసీ రోడ్డు పనులు గాను రూ.11.90 కోట్లు నిధులు విడుదలైందని పంచాయతీరాజ్ డీఈ ఆనంద్ రెడ్డి తెలిపారు. గంగాధర నెల్లూరు పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీల్లో పెట్టిన గ్రామసభలలో తయారు చేసిన నివేదికలను ఆయా మండలాల నుండి జిల్లా కలెక్టర్‌కు పంపించగా ఆ మేరకు పనులకు నిధులు మంజూరు చేశారని చెప్పారు. నియోజకవర్గంలో కార్వేటినగరం మండలానికి 31 పనులకు రూ. 4కోట్లు, గంగాధర నెల్లూరు మండలానికి 39 పనులకు గాను 1.59 కోట్లు, పెనుమూరు మండలానికి 62 పనులకు గాను రూ.2.11 కోట్లు, ఎస్ఆర్ పురం మండలానికి 56 పనులకు రూ.1.75 కోట్లు, వెదురుకుప్పం మండలానికి 56 పనులకు రూ.1.75 కోట్లు , పాలసముద్రం మండలానికి నాలుగు పనులకు రూ.70లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులను ఆరు మండలాల్లో ని గ్రామాలలో సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులు త్వరలో జరుగుతుందని డీఈ చెప్పారు.

నిబంధనలు పాటించాల్సిందే: ఎస్ఐ

ప్రజాశక్తి-కోట: వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని కోట ఎస్ఐ పవన్ కుమార్ అన్నారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడా రు. తప్పనిసరిగా వినాయక ఉత్సవాలకు సంబం ధించి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నా రు. నిర్దేశించిన నిబంధనల మేరకే ఉత్సవాలను నిర్వహించాలని కాదని ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వినాయక ప్రతిమల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ ముత్తయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు సూచించారు. గురువారం వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిబంధనలను కఠినతరం చేసినట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. తప్పనిసరిగా ప్రజలందరూ పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

'మట్టి విగ్రహాలనే వాడుదాం'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పర్యావరణ పరిరక్షణకు మట్టివిగ్రహాలను వాడాలని బృందావన్ సీబీఎస్ఈ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి విద్యార్థులకు సూచించారు. స్థానిక సంతపేట నాగాలమ్మ గుడి సమీపంలోని బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో గురువారం వినాయక చవితి, ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బృందావన్ స్కూల్ వ్యవస్థాపకులు శైలజ కుమారి విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే విద్యార్థులకు తయారీ విధానాన్ని వివరించడంతోపాటు విద్యార్థులపై మట్టి విగ్రహాలను తయారు చేయించారు. పాఠశాల డైరెక్టర్ ప్రియా, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లలు అనేక భక్తి పాటలు, నృత్యాలు, ప్రత్యేకించి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ సన్మానం చేశారు.

గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి -సదుం

ఈ నెల 7వ తేదీ నుండీ జరగనున్న గణేష్ ఉత్సవాలపై గురువారం తహశీల్దార్ మారూఫ్ బాషా, ఎస్సై షేక్‌షావలి అధ్యక్షతన 'పీస్ కమిటీ' సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై పీస్ కమిటీ తీర్మానాలు తెలియజేశారు. గణేష్ ఉత్సవాలలో ఏదైనా అసాంఘిక సంఘటనలు జరిగినట్లయితే దీనికి బాధ్యులు ఉత్సవ కమిటీ సభ్యులేనని ఆయన తెలిపారు. మండల పరిధిలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లో అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో శాంతియుతంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థాయి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి- కార్వేటినగరం: వినాయక చవితి వేడుకలకు అనుమతులు తప్పసరిగా తీసుకోవాలని మండల తహసీల్దార్ భగవతి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్లు, చవతి వేడుకల నిర్వాహక కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ చవతి వేడుకలకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరుకునేందుకు నిర్వాహకులు సహరించాలన్నారు. ఊరేగింపులు జరుకునేందుకు ముందస్తు సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని, డీజేలు, లౌడ్ స్వీకర్లు వినియోగించి ఇతరులకు అసౌకర్యం కల్పించకూడదని అన్నారు. ఏఎస్ఐ మునికృష్ణ, వీఆర్వోలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలోమాట్లాడుతున్న తహసీల్దార్ భగవతి

నేడు డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

డయల్ యువర్ ఈవో కార్యక్రమం సెప్టెంబరు 6వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 నుండి 2.50 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి ఈవో జె.శ్యామలరావుకు ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

అక్రమంగా తొలగిస్తే ఊరుకోం..

కలెక్టరేట్ ఎదుట వీవోఏల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

వీవోఏల సమస్యలను పరిష్కరించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు మానుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టరేట్ దగ్గర ఏపీ వెలుగు వీవోఏల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ మాట్లాడుతూ వీవోఏలకు ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే వీవోఏలకు 2024 మార్చి నెల నుండి బకాయి వున్న వేతనాలు చెల్లించాలని, ఇప్పటివరకు వేతనాలకు సంబంధించి అనేక పర్యాయాలు వినతిపత్రాలు అందించామని, ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని ఆర్థిక ఇబ్బందులు నుండి వీవోఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గత రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా మండలంలో వీవోఏలను అక్రమ తొలగింపులకు, వేధింపులకు గురవుతున్నారని, మరి కొంతమందిని తొలగించడానికి లిస్టులు తయారు చేసి ఉద్యోగం నుంచి తొలగిపోవాలని వేధిస్తున్నారని, అధికారులు, స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా వీవోఏల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పై అంశాలపై కమిషన్ వేసి పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ పీడి తులసికి వినతిప్రతం అందజేశారు. పిడి స్పందిస్తూ సమస్యలు పరిష్కారం చేస్తామని వేధింపులు ఉండవని తొలగించిన వారిని విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు జీను రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి, శ్రీధర్ బాబు, కార్యదర్శి, నాగరాజు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పాఠశాల, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరగబోయే చెకుముకి టాలెంట్ టెస్ట్ వాల్‌పోస్టర్లను జిడి నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్, జిల్లా విద్యాశాఖ అధికారి సి.దేవరాజు, సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి వెంకట రమణారెడ్డి, చిత్తూరు జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెకుముకి ద్వారా జనవిజ్ఞాన వేదిక వారు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతోపాటు విద్యార్థులు సైన్సును ఇష్టపడేలా చేస్తున్నారని కొనియాడారు. ఇటువంటి టాలెంట్ టెస్టుల వలన విద్యార్థుల సృజనాత్మకశక్తి మెరుగుపడుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్, జెవివి జిల్లా ప్రధానకార్యదర్శి బాలచైతన్య, ఎస్‌టియు నాయకులు మదన్మోహన్ రెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు చెంగల్రాయ మందడి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

చెకుముకి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ఈనెలాఖరి లోపు పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి

హౌసింగ్ డీఈఈ రమేష్ రెడ్డి

ప్రజాశక్తి- సోమల: మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం ఏ స్టేజీలో ఉన్నా ఈ నెల ఆఖరిలోపు వారికి అందాల్సిన బిల్లులు పూర్తిస్థాయిలో అందజేయాలని హౌసింగ్ డీఈఈ రమేష్ రెడ్డి కోరారు. మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో గురువారం ఉపాధి హామీ వెలుగు సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని గృహ నిర్మాణ లబ్ధిదారులకు వెలుగు ద్వారా రుణసదుపాయం అందుబాటులో ఉందని అవసరమైన వారు లోన్ తీసుకుని ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. ఉపాధి హామీ ద్వారా అందాల్సిన బిల్లులను చెల్లించాలని, నూతనంగా నియమింపబడ్డ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకొని పని దినాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, ఏపీవో దినకర్ బాబు, ఏపిఎం శివ, హౌసింగ్ ఏఈ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ

'ఉపాధి హామీ'లో పండ్ల తోటల పెంపకం

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని కెనమాకులపల్లి గ్రామ పంచాయతీ, వెంకటేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కొబ్బరి మొక్కల పెంపకంను మండల పరిషత్తు అభివృద్ధి అధికారి కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్నకారు, సన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం పనులు చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంకు 163 ఎకరాల్లో 102 మంది రైతులకు సంబంధించిన భూముల్లో కొబ్బరి, మామిడి పండ్ల తోటల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 122 ఎకరాల్లో పూర్తిస్థాయిలో మొక్కలు నాటడం పూర్తి చేయడం జరిగింది, మిగిలినవి వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలియజేశారు. ఉపాధి హామి పథకం ద్వారా ఎకరానికి రూ.1,76,500లు మామిడి మొక్కలకు రూ.88,821లు కొబ్బరి మొక్కల నిర్వహణకు చెల్లించబడుతుందని తెలిపారు. 5 సంవత్సరముల తర్వాత ఎకరాకు సగటున రూ.2,10,000ల ఆదాయం పొందవచ్చునని తెలిపారు. పండ్ల తోటల పెంపకంలో 16 రకాలు పండ్ల తోటలు చేపట్టవచ్చునని తెలిపారు రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు.

పార్వతి పుత్రుడు పర్యావరణ మిత్రుడు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : పార్వతి పుత్రుడు పర్యావరణ మిత్రుడని, అందరూ మట్టితో గణపతి ప్రతిమలనే పూజించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అన్నారు. చిట్టి చేతులతో మట్టి గణపతి తయారీ పోటీ కార్యక్రమాన్ని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవం కమిటీ ఆధ్వర్యంలో గురువారం కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ పోటీలకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లల చెందిన 900 మంది విద్యార్థులు పాల్గొని మట్టితో వినాయక స్వామి యొక్క విగ్రహాలను అత్యంత అద్భుతమైనటువంటి రూపాలలో తయారుచేసి అబ్బురపరిచారు. సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ సభ్యులు ఆర్. సి.మునికష్ణ, భాను ప్రకాష్ రెడ్డి, ఆకుల సతీష్ పాల్గొన్నారు.

ఒకే గొడుగు కిందికి ఆరోగ్య సేవలు

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఒ.ప్రభావతిదేవి ఛాంబర్ నుంచి జిల్లాలోని వైద్యాధికారులతో వికసిత్, ఏపీ 2047-ఆరోగ్య ప్లాన్ పై సమీక్షను జూమ్ ద్వారా నిర్వహించారు. ప్రస్తుతం మనం అవలంబిస్తున్న ప్రైమరీ కేర్, సెకండరీ కేర్, టెర్షరీ కేర్ అన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ప్రజలందరు మెచ్చుకునే ఆరోగ్య సేవలు అందించటమే లక్ష్యమని, ఆ లక్ష్యంతో లైన్ డిపార్ట్మెంట్స్ అందర్నీ కలుపుకొని రోడ్డు యాక్సిడెంట్స్ , సూవి సైడ్స్, సంక్రమణ, అసంకరణ వ్యాధులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను మాత శిశు సంరక్షణ, వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం, క్షయ నిర్మూలన కార్యక్రమం, క్వాలిటేటివ్‌గా నిర్వహించి అద్భుత లక్ష్యసాధనే వికసిత్ ఉద్దేశమని తెలిపారు. ఆ విధంగా అందరూ అధికారులు ముందస్తు యాక్షన్ ప్లాన్ తయారుచేసి ముందుకెళ్లాలని తెలిపారు. అలాగే అందరూ ఆర్ఎంపీలకు మీ పరిధిలో ఉన్న వారికి నోటీసులు ఇచ్చి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాయితీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి- గుడుపల్లి:

మండలంలోని గుడుపల్లి రైతు సేవా కేంద్రంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో 80 శాతం రాయతీతో ఉలవల పంపిణీ జరిగింది. మండల టిడిపి అధ్యక్షులు పీఎం.బాబు నాయుడు ఆధ్వర్యంలో గురువారం రైతులకు ఉలవలను పంపిణీ చేశారు. మండల పరిధిలోని 18 ఆర్‌బికె పరిధిలో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేయని రైతుల కోసం ప్రత్యామ్నాయ పంటగా ఉలవ విత్తనాలను 80 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. క్లస్టర్ ఇంచార్జ్ హేమంబార్ గౌడు, యూనిట్ ఇంచార్జ్ సుబ్రమణి, ప్రధాన కార్యదర్శి భాను, రామయ్య, విజయ్ కుమార్, మంజునాథ్ పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 80శాతం రాయితీ పై ఉలవలు పంపిణీ చేశారు. ఖరీఫ్ రైతులకు ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహకంగా ప్రభుత్వంచే అందించిన రాయితీ ఉలవలు ప్రతి రైతుసేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగరాజరెడ్డి, వెంకటరత్నం, గణేష్, పెద్దబ్బ, కుట్టి, వెంకట మునిరెడ్డి, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

రెండుగంటలు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -సదుం:

సదుం టౌన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటల నుండీ ఒంటి గంట వరకు ట్రాన్స్ ఫార్మర్ మెయింటినెన్స్ వలన విద్యుత్ సరఫరా ఉండదని ఎస్‌పిడిసిఎల్ ఏఈ (ఆపరేషన్)ఖాదర్ ఇలాహి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటరు సర్వే వేగవంతం చేయండి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:

ఓటరు సర్వే వేగవంతం చేయాలని తహశీల్దార్ సుబ్రమణ్యం బిఎల్‌వోలను ఆదేశించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఓటరు పరిశీలనలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబు నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున రెడ్డి, సిబ్బంది కిరణ్, గురునాథ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని త్యాగరాజ వీధిలో శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో 37మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశా రు. కార్యక్రమానికి దాతలుగా సౌందర్యమ్మ వ్యవ హరించి రూ.ఐదు వేలు అందజేశారు. క్లబ్ అధ్య క్షురాలు తనూజ రెడ్డి, కార్యదర్శి అనిత, సభ్యులు స్నేహలత రెడ్డి, శశిరేఖ, లక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో అడపాల రామయ్య జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ పట్టణ నాయకులు అడపాల ప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రి దివంగత అడపాల రామయ్య వందవ జయంతి సందర్భంగా అన్నదానం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. కార్యక్రమంలో సుగుణమ్మ, కనక కుమారి, లక్ష్మీ ప్రసన్న, కల్పన, శివకుమార్, క్రాంతి కుమార్, అనీష్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.